మనం
కరీంనగర్
జగిత్యాల- రాజన్న సిరిసిల్ల- పెద్దపల్లి -మంచిర్యాల- కొమురంభీమ్
శనివారం | 18 | మార్చి | 2023 | పేజీలు : 8


## భీభత్సం సృష్టించిన గులాబ్ తుఫాన్

7 లో



# అకాల వర్షంతో నష్టపోయిన అన్నదాతలు

### జమ్మికుంటలో నేల వాలిన మొక్కజొన్న పంటలు

జమ్మికుంట, మార్చి 17 (మనం న్యూస్)ః ప్రకృతి మరోసారి కన్నెర్ర జేయడంతో అన్నదాతల పరిస్థితి అయోమయంగా మారింది. అరుగాలం కష్టించి వేసుకున్న పంటలను అకాల వర్షాలు నిండా ముంచేశాయి. గురువారం సాయంత్రం జోరుగా కురిసిన వర్షానికి కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలంలోని మొక్కజొన్న పంటలు నేలవాలాయి. మండలంలోని ఐదు క్లస్టర్లు, తొమ్మిది రెవెన్యూ గ్రామాల పరిధిలో సుమారు 326 మంది రైతులకు చెందిన 696 ఎకరాల మొక్కజొన్న పంట నేలవాలినట్లు మండల వ్యవసాయ అధికారి గోవర్ధన్ రెడ్డి ప్రాథమిక అంచనా వేశారు. అకాల వర్షానికి దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వం ఆదుకోవాలని రైతన్నలు కోరుతున్నారు. చేతికి వచ్చిన పంట నేల వాడడంతో కర్షకులు ఆపన్న హస్తం కోసం ఎదురుచూస్తున్నారు. ఇంకా నాలుగు రోజుల పాటు వర్షాలు పడే అవకాశం ఉన్నదనే సమాచారంతో రైతన్నలు ఇంకా ఎంత పంట నష్టపోవాల్సిన దురవస్థ ఎదురవుతుం దోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



### మోడీ చెప్పినట్టుగా

# ఈడీ పనిచేస్తోంది

- కవిత విషయంలో అతిగా వ్యవహరిస్తోన్న బిజెపి సర్కార్
- అనుమానితురాలంటూ నిందితురాలిగా చిత్రీకరించేందుకు కుట్రలు

: చొప్పదండి ఎమ్మెల్యే రవిశంకర్

3 లో



### దళితులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకే

# దళిత బంధు

### కరీంనగర్ కలెక్టర్ కర్ణన్

కరీంనగర్ బ్యూరో, మార్చి 17 (మనం న్యూస్)ః దళితులను సామాజి కంగా, ఆర్థికంగా బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం దళిత బంధు పథకం ప్రవేశపెట్టిందని జిల్లా కలెక్టర్ ఆర్ వి కర్ణన్ అన్నారు. సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీ బృందం సభ్యులు శుక్ర వారం కలెక్టర్ క్యాంప్ ఆఫీసులో జిల్లా కలెక్టర్ ను కలిశారు. ఈ సందర్భంగా హుజురాబాద్ నియోజకవర్గంలో పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టిన దళిత బంధు పథకం గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా బృందానికి కలెక్టర్ వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ పథకం కింద హుజరాబాద్ నియోజకవర్గం లోని 18వేల21 మంది లబ్ధి దారులకు వివిధ యూనిట్లు నెలకొల్పేందుకు నేరుగా వారి ఖాతాల్లో 9.90 లక్షల రూపాయలు, 10 వేల రూపాయలు దళిత రక్షణ నిధి కింద జమ చేయడం జరిగిందన్నారు. ఈ నిధులతో లబ్ధిదారులు వివిధ రకాలైన యూనిట్లు హార్వెస్టర్లు, ట్రాక్స్, ట్రాక్టర్లు, డీసీఎం వ్యాన్, ప్రోక్లైన్, మినీ గూడ్స్ వెహికల్స్, కార్లు, మెడికల్ షాప్, ఫర్టిలైజర్ షాప్, సూపర్ మార్కెట్, డైయిరి, పేపర్ ప్లేట్ మ్యానుఫ్యా క్చరింగ్, ఐరన్ బెడ్స్ మ్యానుఫ్యాక్చ రింగ్ యూనిట్ నెలకొల్పి వ్యాపారవేత్తలుగా రాణిస్తున్నా రన్నారు. ఒకప్పుడు కూలీలుగా, డ్రైవర్లుగా పనిచేసిన వారు నేడు యజమానులయ్యారన్నారు. దళితులు ఉన్నత స్థితికి ఎదిగేందుకు



దళిత బంధు పథకం ఉపకరిస్తుందన్నారు. ఈ సమావేశంలో సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీ డైరెక్టర్ రేవతి, అదనపు కలెక్టర్ గరీమ అగర్వాల్, ట్రైనీ కలెక్టర్ లెనిన్వాట్సల్ టోప్పో, సెస్ అధికారులు ప్రదీప్ కాంబ్లే, డాక్టర్ వెంకట్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ముత్తారం మండలంలోని కేజీబీవీ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

### విద్యార్థులతో కలిసి భోజనం చేస్తూ విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలపై ముచ్చటించిన కలెక్టర్ సంగీత సత్యనారాయణ



ముత్తారం,మార్చి 17 మనం న్యూస్ : జిల్లా లోని ప్రభుత్వ రెసిడెన్షియల్ సంస్థల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని,ఆహార నాణ్యత ప్రమాణాలపై ఎట్టి పరిస్థితుల్లో రాజీ పడవద్దని,అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.సంగీత సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం ముత్తారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఉన్న ఆహారపు స్టాక్ నాణ్యతను కలెక్టర్ పరిశీలించారు. కేజీబీవిలో కల్పిస్తున్న సౌకర్యాలు,అందిస్తున్న ఆహారం వివరాలు,వాటి నాణ్యత తదితర అంశాలపై కలెక్టర్ నేరుగా విద్యార్థినులతో ముచ్చటించారు. కేజీబీవీ పాఠశాల కిచెన్ పరిసరాలను,మధ్యాహ్నం అందించే భోజనాన్ని పరిశీలించి విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. కేజీబీవీ పాఠశాలలో ఉదయం అందించే టిఫిన్,మధ్యాహ్నం,రాత్రి భోజనాలు ,సాయంత్రం స్నాక్స్ నాణ్యత ప్రమాణాలు ఎలా ఉంటాయని వివరాలను కలెక్టర్ విద్యార్థినులతో మాట్లాడి తెలుసుకున్నారు. విద్యార్థినులకు అందించిన మధ్యాహ్నం భోజనం నాణ్యత,రుచిపై సంతృప్తి వ్యక్తం చేసిన కలెక్టర్,పిల్లలకు అందించే ఆహారం,త్రాగునీటి నాణ్యతపై రాజీ పడవద్దని,అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచించారు. జిల్లా లోని మండల ప్రత్యేక అధికారులు వారి మండలం పరిధిలో ఉన్న రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలలు,మోడల్ పాఠశాలలు,కేజీబీవీలను తనిఖీ చేయాలని,అక్కడ ఉన్న ఆహారపు స్టాక్ నాణ్యతను పరిశీలించాలని కలెక్టర్ ఆదేశాల జారీ చేశారు. మండల ప్రత్యేక అధికారులు తమ తనిఖీలలో ఆహార నాణ్యత, త్రాగునీరు నాణ్యత తదితర అంశాలు నిశితంగా పరిశీలించాలని, విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి గమనించాలని,వ్యక్తిగత పరిశుభ్రత పాటించేలా చూడాలని, అలాగే పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థులకు అందించే ఆహారంలో నాణ్యమైన వస్తువులు వాడాలని,పరిసరాలు పరిశుభ్రంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని,కిచెన్ శుభ్రంగా ఉంచడంతో పాటు,తాజా కూరగాయలు వాడాలని, కూరగాయలను,శుభ్రం చేసుకొని వాడాలని కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థులతో ప్రత్యేక అధికారులు చర్చించి పాఠశాలలో కల్పించాల్సిన ఇతర వసతుల వివరాలు తెలుసుకోని వెంటనే ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జక్కుల ముత్తయ్య,జడ్పీటీసీ చెలుకల స్వర్ణలత అశోక్,వైస్ ఎంపీపీ సూదాటి రవీందర్రావు,ముత్తారం సర్పంచ్ తుటి రజిత రఫీ,ఎంపిడిఓ కే.శ్రీనివాస్,కేజీబీవి ప్రధానోపాధ్యాయులు,సంబంధిత అధికారులు,విద్యార్థినులు,తదితరులు పాల్గొన్నారు.

## నేడు శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో కల్యాణం



వీణవంక- మార్చి 17(మనం న్యూస్): మండలంలోని మామిడాలపల్లి గ్రామంలో వెలసిన శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో నేడు శ్రవణం నక్షత్రం ను పురస్కరించుకొని ఉదయంఅంగప్రదక్షణలు,శ్రీవారికి అభిషేకం ,కళ్యాణం నిర్వహించబడునని ఆలయ అర్చకులు సంతోష్ చార్యులు, నరసింహ చార్యులు తెలిపారు. పరిసర గ్రామాల ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కాగలరని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ వైస్ చైర్మన్ గాదె రమణారెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## పదవికి రాజీనామా చేసిన పిఎసిఎస్ చైర్ పర్సన్

సిరిసిల్ల టౌన్, మార్చి 17 (మనం న్యూస్): సిరిసిల్ల అర్బన్ పెద్దూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్‌పర్సన్ బర్కం వెంకటలక్ష్మి తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు శుక్రవారం రాజీనామా లేఖను జిల్లా సహకార అధికారికి సమర్పించారు. సిరిసిల్ల జిల్లాలో భారతీయ జనతా పార్టీకి చెందిన ఏకైక పాక్స్ చైర్‌పర్సన్ వెంకటలక్ష్మి రాజీనామా చేయడం పట్ల పార్టీ వర్గాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

### లక్కారంలో నూతనంగా నిర్మిస్తున్న రామలయ దేవాలయంలో

## ధ్వజస్థంభ ఉత్సవాల్లో జెడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్



ముత్తారం,మార్చి 17 మనం న్యూస్ : ముత్తారం లక్కారం గ్రామంలో నూతనంగా నిర్మించిన కోదండ రామాలయంలో దేవతామూర్తి,. ద్వజస్థంభ ప్రతిష్టాపన ఉత్సవాల్లో జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధుకర్ పాల్గొన్నారు. ప్రతిష్టాపన ఉత్సవాలను హాజరైన జెడ్పీ చైర్మన్‌కు ఆలయ అర్చకులు,ఆలయ కమిటి సభ్యులు ఘనస్వాగతం పలికారు. అనంతరం రామాలయం వద్ద రూ.7.60లక్షల డిఎంఎఫ్‌టి,సీడిపి నిధులతో చేపట్టిన కమ్యూనిటీ హాల్‌ను ఆయన ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆలయాల నిర్మాణంలో అధ్యాత్మిక బావన పెంపొందుతుందని,యువత అధ్యాతికతవైపు మొగ్గు చూపాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జక్కుల ముత్తయ్య,జెడ్పిటిసి చెలుకల స్వర్ణలత అశోక్‌యాదవ్,సర్పంచ్ లలిత చంద్రమౌళి,గుజ్జుల రాజిరెడ్డి,ఆర్బిస్ మండల అధ్యక్షుడు అత్తె చంద్రమౌళి,బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు కిషన్‌రెడ్డి,వైస్ ఎంపీప ఈరవీందరావు,బిఆర్ఎస్ నాయకులు,గ్రామస్థులు మాదాసి రమేష్,తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదం ఒకరు మృతి ఇద్దరికీ తీవ్రగాయాలు





మంథని,మార్చి 17 మనం న్యూస్ : మంథని మండలం ఖానాపూర్ గ్రామానికి చెందిన రాపాక మధుకర్ (32) తన భార్య రాపాక సౌజన్య (28),తన బాబాయ్ కుమా రుడు రాపాక యశ్వంత్ (10) లతో కలిసి భూపాలపల్లి జిల్లా గొర్లవీడు గ్రామానికి శుభకార్యా నికి ద్విచక్ర వాహనంపై వెళుతు న్న క్రమంలో బట్టుపల్లి గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో రాపాక సౌజన్య అక్కడికక్కడే మృతి చెందగా,రాపాక మధుకర్ కాలు,యశ్వంత్ చెయ్యి విరిగి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం రాపాక మధుకర్ ద్విచక్ర వాహనంపై భూపాలపల్లి వైపు వెళ్తుండగా,మంథని నుండి భూపాలపల్లి వైపు వెళ్తున్న బస్సును ఢీకొనగా ద్విచక్ర వాహనం అదుపుతప్పి అటుగా నుండి మంథని వై పు వస్తున్న లారీకి ద్విచక్ర వాహనం బలంగా ఢీకొట్టడంతో ప్రమాదం చోటు చేసుకున్నట్లు స్థానికులు వివరించారు. ప్రమాదంలో గాయపడిన మధుకర్ యశ్వంత్ లను మంథని ప్రభుత్వాసుపత్రికి 108 లో తరలించినట్లు స్థానికులు పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న మంథని ఎస్ఐ వెంకటేశ్వర్లు,పోలీస్ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని ధర్యాప్తు చేస్తున్నారు.

## ఐదు రూపాయల మీల్స్ క్యాంటిన్ తెరవాలని జాతీయ మైనార్టీ కమిషన్‌కు ఫిర్యాదు

కరీంనగర్ కలెక్టరేట్, మార్చి 17 (మనం న్యూస్): పేద మైనారిటీల కోసం రూపాయలు ఐదు రూపాయల మీల్స్ క్యాంటీన్లు తెరవడంలో జిల్లా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పేర్కొంటూ ఇండియా జనశక్తి పార్టీ తెలంగాణ చీఫ్ బండి శ్రీనివాస్ జాతీయ మైనార్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఫిర్యాదు లేఖను శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో ఐదు రూపాయల ఆహార పథకాన్ని ప్రారంభించాలని జిల్లా కలెక్టర్‌కు పలు మార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ స్పందన లేదన్నారు. నగర పరిధిలోని కార్ఖానా గడ్డ, పాత బజార్, రేకుర్తి ప్రాంతాల్లో పేద మైనారిటీల కోసం మీల్స్ క్యాంటిన్లు తెరవడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించిన కారణంగానే జాతీయ మైనార్టీ కమిషన్‌ను ఆశ్రయించినట్లు తెలిపారు.

# సిపిఆర్ విధానంతో గుండె పోట్ల నుంచి రక్షణ

### కరీంనగర్ సిపి సుబ్బారాయుడు

కరీంనగర్ బ్యూరో, మార్చి 17 (మనం న్యూస్): సిపిఆర్ విధానంతో ఆకస్మిక గుండెపోట్ల నుండి ప్రజల ప్రాణాలను కాపాడవచ్చని కరీంనగర్ పోలీస్ కమిషనర్ ఎల్. సుబ్బరాయుడు అన్నారు. ఆకస్మిక గుండెపోట్ల నుండి ప్రజలను రక్షించేందుకు అన్నిస్థాయిలకు చెందిన పోలీసులకు శిక్షణ ఇప్పిస్తున్నట్లు తెలిపారు. కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ కేంద్రంలో శుక్రవారం కరీంనగర్ రూరల్ డివిజన్, సిటి ఆర్మ్‌డ్ రిజర్వ్, క్యూఆర్టీ విభాగాలకు చెందిన పోలీసులకు సిపిఆర్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బరాయుడు మాట్లాడుతూ ఆకస్మిక గుండె పోట్లతో ఈ మధ్య సంభవిస్తున్న మరణాలను తగ్గించేందుకు సిపిఆర్ శిక్షణలు దోహదపడుతాయన్నారు. ఆకస్మిక గుండెపోట్లు సంభవించిన సందర్భాల్లో సిపిఆర్ విధానం ద్వారా అందడం, నోటిద్వారా ఆక్సిజన్ అందించడం వల్ల గుండె పనిచేయడం ప్రారంభించి ప్రమాదానికి గురైనవారిని రక్షించవచ్చని తెలిపారు. నిత్యం ప్రజల మధ్యఉండే పోలీసులకు ఆకస్మిక గుండెపోట్లు సంభవించిన వ్యక్తులు తారసపడే అవకాశం ఉన్నదందున, అన్నిస్థాయిలకు చెందిన పోలీసులు పూర్తిస్థాయిలో శిక్షణ పొందినట్లయితే అలాంటి వ్యక్తుల ప్రాణాలను రక్షించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని చెప్పారు. శాంతిభద్రతల పరిరక్షణ విధులతోపాటు ప్రజల ప్రాణాలను రక్షించే చర్యల ద్వారా పోలీస్ శాఖ ప్రతిష్ట పెంపొందుతుందని తెలిపారు. పోలీస్ శాఖ ప్రతిష్టను పెంపొందించే విధంగా సేవలందించే పోలీసులకు గుర్తింపు లభించడంతోపాటు శాఖాపరంగా రివార్డులు,



ఆవార్డులను అందజేస్తామని ప్రకటించారు. ఈ సందర్భంగా వైద్యులు కిరణ్, ప్రణవ్‌లు సిపిఆర్ విధానంపై శిక్షణ ఇచ్చారు. అనంతరం వైద్యులు అన్నిస్థాయిలకు చెందిన పోలీసులతో సిపిఆర్ విధానాన్ని చేయించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిసిపిలు ఎస్ శ్రీనివాస్, జి.చంద్రమోహన్, ఏసిపి సి ప్రతాప్, ఆర్ఐ లు సురేష్, మురళీ, శేఖర్‌బాబు, యూనిట్ ఆసుపత్రి అసిస్టెంట్ అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

# మోడీ చెప్పినట్టుగా ఈడీ పనిచేస్తోంది



కరీంనగర్ టౌన్, మార్చి 17 (మనం న్యూస్)ః ప్రధాని నరేంద్ర మోడీ చెప్పినట్టుగా ఈడి పనిచేస్తోందని కరీంనగర్ జిల్లా చొప్పదండి శాసనసభ్యులు సుంకె రవిశంకర్ ఆరోపించారు. ఎమ్మెల్సీ కవిత విషయంలో ఓ మహిళ అని కూడా చూడకుండా బిజెపి ప్రభుత్వం అతిగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. శుక్రవారం కరీంనగర్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కుట్రపూరిత రాజకీయాలను కొనసాగిస్తోందన్నారు. కవిత ఎలాంటి తప్పు చేయకున్నప్పటికీ బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. అనుమానితురాలిగా పేర్కొంటూ నిందితురాలిగా చిత్రీకరించేందుకు బిజెపి కుయుక్తులు పన్నుతోందని ఆయన ఆరోపించారు. తెలంగాణలో కెసిఆర్‌ను రాజకీయంగా ఎదుర్కొనే దమ్ములేక, కెసిఆర్‌కు దేశ వ్యాప్తంగా వస్తోన్న ఆదరణ చూసి ఓర్వలేకనే బిజెపి అక్రమ కేసులతో కుట్రలకు పూనుకుంటోందన్నారు. కేసుతో సంబంధం లేని కవితను తొమ్మిది గంటల పాటు విచారణ పేరిట వేధించిన ఇడి దేశ ఆర్థిక వ్యవస్థలను అతలాకుతలం చేసిన ఆదాని, మాల్యాల పట్ల ఎందుకు మౌనంగా ఉంటుందని రవిశంకర్ ప్రశ్నించారు. సంతోష్ కుమార్ ఎమ్మెల్యేల కొనుగోలులో దొరికితే సిట్ ముందుకు రావాలని ఆదేశిస్తే రాకుండా తప్పించుకుని, సుప్రీంకోర్టు నుంచి ఆదేశాలు తెచ్చుకున్నది నిజం కాదా అని వ్యాఖ్యానించారు. ప్రజల చేత ప్రజల కొరకు ఎన్నుకోబడ్డ తొమ్మిది రాష్ట్రాల ప్రభుత్వాలను కూల్చి వేసి రాక్షసానందం పొందుతున్న నరేంద్ర మోడీ కుట్రలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఈ సమావేశంలో టిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు జివి రామకృష్ణారావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్ కుమార్ గౌడ్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ముదిగంటి సురేందర్ రెడ్డి, రాష్ట్ర నాయకులు పీర్ల వెంకటేశ్వరరావు, చల్ల హరి శంకర్, ఎంపీపీలు పర్లపల్లి వేణుగోపాల్, చిలుక రవీందర్, మేనేని స్వర్ణలత రాజనర్సింగారావు, కలిగేటి కవిత లక్ష్మణ్, జడ్పిటిసిలు పుల్కం అనురాధ నరసయ్య, మాచర్ల సౌజన్య వినయ్, పునుగోటి ప్రశాంతి కృష్ణారావు, కత్తెరపాక ఉమా కొండయ్య, పార్టీ మండల అధ్యక్షులు మేచినేని నవీన్ రావ్, గంట్ల జితేందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి,కొండయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ లు గడ్డం చుక్కారెడ్డి, మామిడి తిరుపతి, కోరంట్ల నరేందర్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్లు దూలం బాలగౌడ్, తిరుపతి రావ్, యువజన విభాగం రాష్ట్ర నాయకులు బందారపు అజయ్ కుమార్ గౌడ్, దేవ మధుసూదన్ రెడ్డి, కొట్టేపల్లి సుధాకర్, కొంకటి లచ్చిరెడ్డి ,ఆరెల్లి చంద్రశేఖర్ గౌడ్, సాగర్ రెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.

## రేణుక ఎల్లమ్మ ఆలయానికి కాకా ఫౌండేషన్ విరాళం



ధర్మారం, మార్చి 17 (మనం న్యూస్)ః పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం కటికనపల్లి ఎల్లమ్మ ఆలయానికి కాకా ఫౌండేషన్ ఆధ్వర్యంలో 52వేల రూపాయల విరాళాన్ని అందించారు. ఈ మేరకు కాకా ఫౌండేషన్ సభ్యులు కాడే సూర్యనారాయణ, యాల తిరుపతిరెడ్డి శుక్రవారం నగదును రేణుక ఎల్లమ్మ ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, బిజెపి మండల అధ్యక్షులు యాల్ల తిరుపతిరెడ్డి, గౌడ సంఘం అధ్యక్షులు శేపూరి తిరుపతి, నాయకులు అన్నపురం లింగయ్య, ఉయ్యాల మల్లేశం, కృష్ణ, జంగిలి కిషోర్, రేండ్ల శ్రీనివాస్, రమేశ్ ,మురళి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## చిన్న హనుమాన్ జయంతికి పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టాలి : ఎస్పీ భాస్కర్



జగిత్యాల ప్రతినిధి, మార్చి 17( మనం న్యూస్): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కొండగట్టులో చిన్న హనుమాన్ జయంతి సందర్భంగా నిర్వహించే మహోత్సావలను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలని జగిత్యాల ఎస్పీ ఎగ్గడి భాస్కర్ అధికారులను ఆదేశించారు. చిన్న హనుమాన్ జయంతి సందర్భంగా ఆలయానికి పెద్ద ఎత్తున భక్తులు వచ్చే అవకాశం ఉందని, ఏలాంటి నేరాలకు తావులేకుండా, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు.ఆలయ పరిసరాల్లో, మాలవిరమణ, క్యూలైన్లలో, వాహనాల రాకపోకలు మొదలైన ప్రదేశాల్లో ఏర్పాటు చేయవలసిన భద్రత ఏర్పాట్ల గురించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం కొండగట్టుపైన ఏర్పాటు చేసిన పోలీస్ ఔట్ పోస్ట్ తనిఖీ చేశారు. పోలీస్ అవుట్ పోస్టుకు అనుసంధానం చేసిన సిసి కెమెరాలు పనితీరును ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిఎస్పి ప్రకాష్, మల్యాల సి.ఐ రమణమూర్తి పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయంపై కరీంనగర్‌లో బిజెపి సంబరాలు



కరీంనగర్, మార్చి 17 (మనం న్యూస్)ః ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నికల్లో బిజెపి అభ్యర్థి ఏవిఎన్ రెడ్డి విజయం సాధించడం పట్ల భారతీయ జనతా పార్టీ కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం స్థానిక తెలంగాణ చౌక్ లో ఘనంగా సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి శ్రేణులు టపాసులు పేల్చి, మిఠాయిలు పంపిణీ చేశారు . ఈ కార్యక్రమంలో పాల్గొన్న బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, జిల్లా పార్టీ ఇంచార్జి, మాజీ శాసనసభ్యులు ఎన్వీఎస్ ప్రభాకర్, జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డిలు మాట్లాడుతూ ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నికల్లో బిజెపి అభ్యర్థి విజయం సాధించడం శుభపరిణామమన్నారు. ఈ విజయంతో రాబోయే ఎన్నికల్లో బిజెపి ఘన విజయం సాధించి తెలంగాణలో ప్రభుత్వాన్ని స్థాపించడం ఖాయమన్నారు. ఇంతటి గొప్ప విజయాన్ని అందించిన ఉపాధ్యాయులందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోమల్ల ఆంజనేయులు, జిల్లా ప్రధాన కార్యదర్శులు తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్ ,కళ్లెం వాసుదేవరెడ్డి బత్తుల లక్ష్మీనారాయణ,కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్ రావు, జిల్లా ఉపాధ్యక్షులు గుర్రాల వెంకట్ రెడ్డి, మాడ వెంకట్రెడ్డి, జిల్లా ఆఫీస్ సెక్రటరీ మాడుగుల ప్రవీణ్, మీడియా కన్వీనర్ కట్టంలోకేష్, వైదా రామానుజన్, అధికార ప్రతినిధులు బొంతల కళ్యాణ్ చంద్ర, జానపట్ల స్వామి, ఎడమ సత్యనారాయణ రెడ్డి, చొప్పరి జయశ్రీ, బండ రమణారెడ్డి ,జాడి బాల్రెడ్డి, దుబాల శ్రీనివాస్, పుప్పాల రఘు, గొడుగు వినోద్, ఆవుదుర్తి శ్రీనివాస్, నరహరి లక్ష్మారెడ్డి, సొల్లు అజయ్ వర్మ మామిడి చైతన్య రమేష్ తదితరులు పాల్గొన్నారు.

**ః బూత్ స్వశక్తికరణ్ అభియాన్ విజయవంతం చేయాలిః**

పోలింగ్ బూత్ స్థాయిలో భారతీయ జనతా పార్టీని మరింత బలోపేతం చేయడానికి చేపట్టిన సశక్తి కరణ్ అభియాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎన్ వి ఎస్ ఎస్ ప్రభాకర్ పిలుపునిచ్చారు. శుక్రవారం కరీంనగర్‌లో బిజెపి స్వశక్తి కరణ్ అభియాన్ సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగాశక్తి కేంద్రాల స్ట్రీట్ కార్నర్ సమావేశాలు విజయవంతంగా పూర్తి చేసినందున, బూత్ పరిధిలో చేపట్టిన సశక్తికరణ్ అభియాన్ కార్యక్రమాన్ని అదే స్థాయిలో విజయవంతం చేయడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. పోలింగ్ బూత్ పరిధిలో బూతు స్థాయి శ్రేణులఅందర్నీ కలుపుకొని, పార్టీ సూచనలను పరిగణలోకి తీసుకొని స్వశక్తికరన్ అభియాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు.

## మైనార్టీ కార్పొరేషన్ లబ్ధిదారుల ఇంటర్వ్యూల బహిష్కరణ



గంభీరావుపేట, మార్చి 17 (మనం న్యూస్)ః గంభీరావుపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించ తలపెట్టిన మైనార్టీ కార్పొరేషన్ ఇంటర్వ్యూలను బహిష్కరించారు. ఎంపీడీవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో బ్యాంకు మేనేజర్ లతో లబ్ధిదారుల ఇంటర్వ్యూల కార్యక్రమం చేపట్టారు. చాలామంది మైనార్టీ కార్పొరేషన్ రుణానికి దరఖాస్తులు చేసుకున్నప్పటికీ కేవలం ఆరు యూనిట్లు మంజూరు చేయడం సరికాదని పేర్కొంటూ మండల కాంగ్రెస్ అధ్యక్షులు హమీద్ ఆధ్వర్యంలో పలువురు లబ్ధిదారులు ఇంటర్వ్యూలను బహిష్కరించారు. మండల కేంద్రంలో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు అనుకూలంగా యూనిట్లను మంజూరు చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. యూనిట్లను పెంచి ఇంటర్వ్యూలు నిర్వహించాలని ఎంపిడిఓ శ్రీనివాస్ కు వినతిపత్రం అందజేశారు. ఈ విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు ఎంపీడీవో ఈ సందర్భంగా లబ్ధిదారులకు హామీ ఇచ్చారు.

## కొండగట్టు అంజన్నను దర్శించుకున్న దేవాదాయ శాఖ కమిషనర్

జగిత్యాల ప్రతినిధి, మార్చి 17 (మనం న్యూస్): జగిత్యాల జిల్లా కొండగట్టు ఆంజనేయస్వామి దేవాలయాన్ని రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ వి.అనిల్‌కుమార్ శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో జరిగిన చోరీ, తదితర అంశాలపై జిల్లా పోలీస్ అధికారులు, ఆలయ అధికారులతో పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆంజనేయ స్వామి దేవస్థానం కొండగట్టు ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వేదపండితులచే ఆశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ మల్లికార్జున్ రెడ్డి, జిల్లా ఎస్పీ భాస్కర్, ఫౌండర్ ట్రస్టీ మారుతీ స్వామి, ఆలయ కార్యనిర్వాహణాధికారి శ్రీనివాస్, డిఎస్పీ ప్రకాష్, సీఐ రమణ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.



# గాయపడ్డ గీతకార్మికున్ని ప్రభుత్వం ఆదుకోవాలి

## ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి



జగిత్యాల ప్రతినిధి, మార్చి 17 (మనం న్యూస్): తాటి చెట్టు పై నుండి పడి తీవ్రంగా గాయపడిన గీతా కార్మికుడు తిరుమల శ్రీనివాస్‌ను ప్రభుత్వం ఆదుకోవాలని పట్టభద్రుల ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి అన్నారు. సారంగపూర్ మండలం పోచంపేట్ గ్రామానికి చెందిన గీతాకార్మికుడు శ్రీనివాస్ ఇటీవల కల్లు గీసేందుకు చెట్టు ఎక్కి, జారి పడి తీవ్రంగా గాయ పడ్డాడు. కాలు విరిగి ఇంటికి పరిమితమైన ఆయనను పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి శ్రీనివాస్ శుక్రవారం పరామర్శించారు. తీవ్రంగా గాయపడిన శ్రీనివాస్ మంచానికే పరిమితం కావడం తో కుటుంబాన్ని ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని జీవన్ రెడ్డి కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ వెంట బేతి శంకర్ , ఆకు రాజిరెడ్డి, తిరుపతి తదితరులున్నారు.

# కరాటే పోటీల్లో క్రిష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థి ప్రతిభ




జగిత్యాల ప్రతినిధి, మార్చి 17 (మనం న్యూస్): ఓకినోవా స్కూలు ఆఫ్ కరాటే మార్షల్ ఆర్ట్స్ వేములవాడ వారి ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన కరాటే పోటీల్లో స్థానిక బీట్ బజార్‌లోని క్రిష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థి మామిడాల రామ్ చరణ్ అత్యుత్తమ ప్రదర్శనతో విజేతగా నిలిచారు. ఈ సందర్భంగా పాఠశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ జ్యోతి రవీందర్ రెడ్డి రామ్ చరణ్ ను అభినందించారు. భవిష్యత్‌లు మరింత రాణించి మరిన్ని పతకాలు సాధించాలని అభిలషించారు.



# అకాల వర్షానికి దెబ్బతిన్న పంటలను పరిశీలించిన ఏడి సునీత



ఇల్లందకుంట, మార్చి 17 (మనం న్యూస్)ః గురువారం సాయంత్రం కురిసిన అకాల వర్షానికి దెబ్బతిన్న మొక్కజొన్న పంటలను హుజురాబాద్ సహాయ వ్యవసాయ సంచాలకులు జి.సునీత శుక్రవారం పరిశీలించారు. మొక్కజొన్న పంట పాక్షికంగా దెబ్బతిన్నాయని క్షేత్రస్థాయిలో పర్యటించి 1215 ఎకరాల్లో మొక్కజొన్న దెబ్బతిన్నాయని తెలిపారు. మొక్కజొన్న రైతులు అధైర్యపడవద్దని మండల ఎంపిపి సరిగొమ్ముల పావని వెంకటేష్ రైతులకు ధైర్యం కల్పించారు. ఎమ్మెల్సీ ప్రభుత్వ విప్ పాడి కౌశిక్ రెడ్డి తో కలిసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వారికి సాయం అందేలా చూస్తానన్నారు. మండల వ్యవసాయ అధికారి గుర్రం రజిత మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పరిశీలించి పూర్తి నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామని తెలిపారు. మొక్కజొన్న సందర్శనలో పిఎసిఎస్ వైస్ చైర్మన్ కందాల కొమురెల్లి, ఉపసర్పంచ్ దంసాని తిరుపతి, మాజీ ఎంపిటిసి సభ్యులు రామ్ స్వరణ్‌రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారి తిరుపతి, రాకేష్, రైతు సమన్వయ సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

## బిజెపి ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి

ఇల్లందకుంట, మార్చి 17 (మనం న్యూస్)ః మండలంలోని పలు గ్రామాల్లో అకాల వర్షానికి మొక్కజొన్న పంట పూర్తిగా దెబ్బతి న్న రైతులను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాల ని బిజెపి మండల ప్రధాన కార్యదర్శి బైరెడ్డి రమణా రెడ్డి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేక రులతో మాట్లాడుతూ రాచపల్లి, బూజునూరు, మల్లన్నపల్లి, టేకుర్తి గ్రామంలో మామిడి తోటలు సాగు చేస్తున్న రైతులు అకాల వర్షంతో పాటు ఈదురుగాలుల కారణంగా మామిడి పూత, కాయ రాలి తీవ్రంగా నష్టపోయారన్నారు. వేముల రాజిరెడ్డి, చేరాల కుమార్ స్వామి అనే రైతుల మామిడి తోటలు తీవ్రంగా దెబ్బతిన్నాయన్నారు. నష్టపోయిన మొక్కజొన్న, మామిడి రైతులకు పరిస్థితిని గమనించి తక్షణమే వారికి ఆర్థిక సహాయాన్ని అందించాలని కోరారు.



# ప్రవీణ్‌కుమార్ అరెస్టుకు నిరసనగా బిఎస్పీ ఆందోళన



సిరిసిల్ల టౌన్, మార్చి 17 (మనం న్యూస్)ః టిఎస్పీఎస్సీ పేపర్లు లీకవడం పట్ల నిరసన వ్యక్తం చేస్తూ, గ్రూప్ 1 పరీక్షను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆమరణ నిరాహార దీక్షకు దిగిన ఆర్‌ఎస్.ప్రవీణ్ కుమార్‌ను అక్రమంగా అరెస్టు చేశారని నిరసిస్తూ స్థానిక అంబేద్కర్ విగ్రహం ముందు బీఎస్పీ, భీమ్ ఆర్మీల అధ్వర్యంలో శుక్రవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా భీంఆర్మీ జిల్లా అధ్యక్షులు దొబ్బల ప్రవీణ్ కుమార్ మాట్లాడుతు నీళ్ల, నియామకాల కోసం కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో నిరుద్యోగులకు నిరాశే మిగిలిందన్నారు. అధికారంలోకి వచ్చిన అనంతరం ఎనిమిదేళ్లకు 80 వేల ఉద్యోగాలంటు గొప్పగా చాటింపు చేసుకున ప్రభుత్వం, పేద, మధ్య తరగతి యువకులకు ఉద్యోగాలను దూరం చేసే విధంగా పేపర్లను లీక్ చేస్తున్నారన్నారు. లీక్ అయిన పేపర్లకు సంబంధించిన పరీక్షలను తక్షణమే రద్దు పరిచి తిరిగి నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో భీమ ఆర్మీ నాయకులు మధు, నవీన్, బిఎస్పీ అధ్యక్షులు స్వామి గౌడ్, రాష్ట్ర నాయకులు అంకని భాను, మధుకర్, బాను, ప్రేమ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# సిరిసిల్లలో నిరుద్యోగి ఆత్మహత్య



రాజన్న సిరిసిల్ల, మార్చి 17 (మనం న్యూస్)ః రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని బీవై నగర్ కు చెందిన నిరుద్యోగ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన కలకలం సృష్టించింది. బీవై నగర్ కు చెందిన చిటికెన నాగభూషణం, సుశీలకు ముగ్గురు కొడుకుల్లో చిన్న వాడైన నవీన్ కుమార్ (30) శుక్రవారం ఇంట్లో ఉరి వేసుకుని చనిపోయాడు. డిగ్రీ పూర్తి చేసిన సదరు యువకుడు సాఫ్ట్ వేర్ రంగంలో స్థిరపడే ప్రయత్నం చేశాడు. ఇదే క్రమంలో గ్రూప్స్ కు ప్రిపేర్ అవుతున్నాడని కుటుంబ సభ్యులు తెలిపారు. నిరుద్యోగిగా బతకలేక తన చదువుకు సార్థకత దొరకకనే మృత్యువు పంచన చేరుతున్నట్లుగా సూసైడ్ లేఖలో పేర్కొంటూ ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మూడు పదుల వయసులోని నవీన్ అర్థాంతరంగా తనువు చాలించిన తీరు స్థానికులను కంటతడి పెట్టిస్తోంది. చెట్టంత ఎదిగిన కొడుకు కళ్ల ముందే మృతునిగా మారడంతో ఆ తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

# స్వచ్ఛత అవార్డు-2023పై అవగాహన సదస్సు

సిరిసిల్ల, మార్చి 17 (మనం న్యూస్)ః స్వచ్ఛ సర్వేక్ష ణ్ -2023 ఉత్సవాల్లో భాగంగా సిరిసిల్ల పట్టణంలోని 17వ వార్డులో ఉమెన్ ఐకాన్స్ లీడింగ్ స్వచ్ఛత అవార్డు-2023 పై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక కౌన్సిలర్ ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడు తూ సిఎం కెసిఆర్ పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి కార్యక్రమాల ద్వారా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ తెలంగాణ రాష్ట్రాన్ని స్వచ్ఛ తెలంగాణగా మారుస్తూ యావత్ భారతదేశంలోనే ఒక ఆదర్శవంత మైన రాష్ట్రంగా తెలంగాణ రాష్ట్రాన్ని తీర్చిదిద్దారన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటిస్తున్న స్వచ్ఛతఅవార్డులు రాష్ట్రానికి వస్తుండడ మే ఇందుకు నిదర్శనమన్నారు. మంత్రి కల్వకుంట్ల తారక రామారావు ఆలోచనల మేరకు




పట్టణ పరిసరాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తూ స్వచ్ఛత నియమాలను విస్తృతంగా ప్రచారం చేస్తూ ప్రజల్లో చైతన్యం కలిగించి సిరిసిల్ల పురపాలక సంఘంకు స్వచ్ఛ సర్వేక్షన్ అవార్డు రావడంలో మహిళల యొక్క పాత్ర చాలా ముఖ్యమైనదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ గుండ్లపెల్లి పూర్ణచందర్, మెప్మా టిఎంసి రాజమణి, సానిటరీ ఇన్స్‌పెక్టర్ సత్యనారాయణ, హెల్త్ అసిస్టెంట్ సుకుమార్, వార్డు ఆఫీసర్ శేఖర్, ఆర్పీలు మేఘన, మమత, మహిళా సమైక్య సంఘాల సభ్యులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# భవన నిర్మాణ కార్మికుల ట్రాక్టర్ బోల్తా.. మహిళ మృతి

## మరో నలుగురి మహిళలకు తీవ్రగాయాలు



తిమ్మాపూర్, మార్చి 17 (మనం న్యూస్)ః కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం నల్లగొండ శివారులో భవన నిర్మాణ కార్మికులు ప్రయాణిస్తున్న ట్రాక్టర్ బోల్తా పడ్డ ఘటనలో ఓ మహిళ మృతి చెందడంతో పాటు మరో నలుగురు మహిళలకు తీవ్ర గాయాలయ్యాయి. శుక్రవారం పోలంపల్లి నుండి నుస్తులాపూర్ వైపు వస్తున్న భవన నిర్మాణ కార్మికుల ట్రాక్టర్ మిల్లర్ అదుపుతప్పి బోల్తాపడడంతో పోలంపెల్లి గ్రామానికి చెందిన ఉప్పారపు రేణుక అక్కడి కక్కడే మృతి చెందగా, మ్యాకల స్వప్న, మ్యాకల శ్రీలత, వట్టే సరవ్వ, ప్యాట కోమలత లకు తీవ్ర గాయాలు కావడంతో కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.



**: తీవ్ర విషాదంలో మృతురాలు కుటుంబం...**

ప్రమాదంలో మృతి చెందిన ఉప్పారపు రేణుకకు ఇద్దరు కుమారులు, భర్త రాజయ్య కొన్ని సంవత్స రాలు క్రితం చెట్టుపై నుండి ప్రమాదవశాత్తు కింద పడగా నడుం విరగడంతో మంచానికే పరిమితమయ్యారు. దీంతో అప్పటి నుండి రేణుక కుటుంబాన్ని పోషణ కోసం కూలీ పనులు చేసేది. కుటుంబ పోషణ భారాన్ని నిర్వహిస్తోన్న రేణుక కూడా రోడ్డు ప్రమాదంలో మరణించగా, ఇప్పుడు ఆ కుటుం బానికి దిక్కెవరు అని రేణుక బంధువులు, గ్రామస్తుల రోదనలతో శోకసంద్రంలో మునిగారు.

## కాచాపూర్‌లో బొడ్రాయి విగ్రహ ప్రతిష్టాపన



శంకరపట్నం, మార్చి 17 (మనం న్యూస్)ః శంకరపట్నం మండలం కాచాపూర్‌లోని ఎస్సీ కాలనిలో నూతన బొడ్రాయి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన జెడ్పిటిసి సభ్యులు లింగంపల్లి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి గ్రామంలో భక్తిశ్రద్ధలతో గ్రామ దేవతలను పూజించడం వల్ల ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి పులికోట రమేష్, మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు గంట మహిపాల్ , సర్పంచ్ కొండ్ర రాజయ్య, ఉప సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచ్ గట్టు తిరుపతి, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సామోదరావు, రాజిరెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షులు ఓదెలు, గద్దపాక గ్రామపంచాయతీ కో-ఆప్షన్ మెంబర్ పులికోట మహేందర్, పార్టీ నాయకులు రాజు, మాతంగి కుమార్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమాల పరిశీలనా కార్యక్రమం




మెట్ పల్లి మార్చి 17 (మనం న్యూస్ ): పట్టణంలోని మహాజన్ గార్డెన్స్‌లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం క్లబ్ సేవా కార్యక్రమాల పరిశీలనా కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ 320జి రిక్కల నారాయణరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు . ఈ సమావేశంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కట్కం రాకేష్ క్లబ్ నిర్వహిస్తోన్న సేవా కార్యక్రమాలను గురించి వివరించారు.అనంతరం నారాయణరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో మొదటి స్థానంలో ఉన్న మెట్ పల్లి లయన్స్ క్లబ్ రాష్ట్రంలో ప్రత్యేక స్థానం సంపాదించిందన్నారు. క్లబ్ ఆధ్వర్యంలో చాలావరకు పేదలకు మేలు కలిగించే కార్యక్రమాలు చేస్తున్నారని అభినందించారు. మెట్ పల్లి లయన్స్ క్లబ్ నిర్వహిస్తోన్న అనేక సేవా కార్యక్రమాల ద్వారానే రాష్ట్రంలోని మొదటి స్థానం సంపాదించిందన్నారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ విలేజ్ల శ్రీనివాస్, క్యాషియర్ ఇందూరు రాకేష్ ,ఆర్ సి ఉష కిరణ్ ,జెడ్ సి కోట గంగజీవన్, నారాయణరెడ్డి, మహాజన నరసింహులు ,వడ్డేపల్లి శ్రీనివాసన్ ,ప్రోహర్ తుకారాం, గంగుల మురళీ,మహాజన్ శివకుమార్ ,నర్సింగరావు పవను, బొమ్మల శంకర్, మృత్యుంజయ్ , చంద్రశేఖర్, దయాకర్ ,వెంకటేష్, తదితరులు లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## ఏవిఎన్ రెడ్డి విజయం పట్ల హర్షం



కరీంనగర్, మార్చి 17 (మనం న్యూస్)ః మహబూబ్ నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ ఉపాధ్యాయ నియోజకవ ర్గానికి జరిగిన ఎన్నికల్లో బిజెపి బలప రిచిన ఏబిఎన్.రెడ్డి విజయం సాధిం చడం పట్ల ఉపాధ్యాయ సంఘం మాజీ రాష్ట్ర నాయకులు, బిజెపి విశ్రాంత ఉద్యోగ ఉపాధ్యాయ రాష్ట్ర సెల్ కో- చైర్మన్ నరహరి లక్ష్మారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం కరీంనగర్‌లో ఆయన మాట్లాడుతూ కెసిఆర్ ప్రభుత్వంలో గత ఎనిమిది సంవత్సరాలుగా ఉపాధ్యాయుల నియామకం చేపట్టపోగా పదోన్నతులు ఇవ్వకుండా, బదిలీలు నిర్వహించకుండా 317 జీవో ద్వారా ఉద్యోగ, ఉపాధ్యాయు లను ఇబ్బందుల గురిచేస్తూ భార్యాభర్తలను విడదీసిన ఘనత కేసిఆర్ ప్రభుత్వానికి దక్కిందన్నారు. విద్యాభివృద్ధిలో గాని ఉపాధ్యాయ సమస్యలను పట్టించుకోవడంలో గానీ నిర్లక్ష్యంగా వ్యహరించిన ఈ ప్రభుత్వానికి ఉపాధ్యాయులు తగిన బుద్ధి చెబుతూ తీర్పు ఇచ్చారన్నారు. గెలిపించిన ఉపాధ్యాయులుకి లక్ష్మారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఇకనైనా ప్రభుత్వం కళ్లు తెరిచి ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలను పరిష్కరించడానికి కృషి చేయాలని హితువు పలికారు.

## రేకుర్తిలో మోడీ ఆటో వోక్స్ వ్యాగన్ ఈవెంట్



కొత్తపల్లి, మార్చి 17 (మనం న్యూస్)ః కరీంనగర్ శివారు రేకుర్తి లో మోడీ ఆటో ప్రైవేట్ లిమిటెడ్ వోక్స్ వాగన్ హిమాయత్ నగర్ ఆధ్వర్యంలో ఆ సంస్థ కార్ల స్పెషల్ ఈవెంట్ శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆదివారం వరకు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఈవెంట్ నిర్వాహకులు వి. శ్రీకాంత్, వి.శివప్రసాద్‌లు మాట్లాడుతూ ఈవెంట్ సందర్భంగా వోక్స్ వాగన్ కార్లపై ప్రత్యేకంగా లక్ష యాభై వేల రూపాయల డిస్కౌంటు కస్టమర్లకు అందిస్తున్నట్లు తెలిపారు. ఒకవేళ స్పాట్ బుకింగ్ చేసుకున్నట్లయితే అదనంగా కస్టమర్లకు 30వేల రూపాయల తగ్గింపు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

## ఎస్సెస్సీ విద్యార్థులకు ప్యాడ్స్, పెన్నులు పంపిణీ



కరీంనగర్, మార్చి 17 (మనం న్యూస్)ః కరీంనగర్ లోని పలు విద్యాసంస్థలలో పదోతరగతి విద్యార్థినీ విద్యార్థులకు మాధవ సేవా సమితి ఆధ్వర్యంలో చిలుకూరి బాలాజీ దేవాలయం స్వామి సురేష్ మహారాజ్ చేతుల మీదుగా ఎగ్జామ్ ప్యాడ్స్, పెన్నులు, స్కేల్, ఎరైజర్స్, షార్పనర్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాధవ సేవా సమితి బాధ్యులు మాట్లాడుతూ రాబోయే పదవతరగతి పరీక్షల్లో విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ విద్యార్థులకు ప్రోత్సాహం అందించాలనే ఉద్దేశంతో పరీక్షలకు అవసరమైన వస్తువులను పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమం లో మననియా మల్లొజల కిషన్ రావు , దావులూరి మురళీధర్, సూర్య భాను ట్రస్ట్ సభ్యులు కామరాపు ప్రసాద్ సదశివా రెడ్డి, 30 ఆచార్యులు పాల్గొన్నారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ శ్యాం ప్రసాద్ లాల్ ని మర్యాదపూర్వకంగా కలిశారు.

## నర్సరీని ఆకస్మికంగా తనిఖీ చేసిన డిఆర్‌డిఓ



శంకరపట్నం, మార్చి 17 (మనం న్యూస్)ః శంకరప ట్నం మండలం వంకాయ గూడెం గ్రామంలోని నర్సరీ ని శుక్రవారం డిఆర్‌డిఓ శ్రీలత ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నర్సరీల్లో మొక్కలను పెంచి పెద్ద చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతుందన్నారు. మొక్కల పెంపకంలో ప్రత్యేక శ్రద్ధ చూపించి వాటిని పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో ఎండి.ఖాజాబషీరుద్దీన్, ఏపీవో శారద, టిపి అశోక్, గ్రామ సర్పంచ్, కార్యదర్శి పాల్గొన్నారు.

## బిజెపి విజయోత్సవ సంబరాలు



మెట్ పల్లి, మార్చి 17 (మనం న్యూస్) : ఉమ్మడి హైదరాబాద్, మహబూబ్‌నగర్, రంగారెడ్డి ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపి బలపరిచిన అభ్యర్థి ఏ విఎన్ రెడ్డి విజయం సాధించడం పట్ల పట్టణంలో బిజెపి, బిజెవైఎంల ఆధ్వర్యంలో శుక్రవారం సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఝాన్సీ చౌరస్తా వద్ద టపాసులు పేల్చి, స్వీట్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో బిజెపి పట్టణ అధ్యక్షులు బొడ్ల రమేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సంభారి ప్రభాకర్, పార్లమెంట్ కో కన్వీనర్ గుంటుక సదాశివం , ధోనికల నవీన్, యాదగిరి బాబు, శ్రీరామ్ శివ, ఆర్మూర్ రంజిత్, ఇల్లెందుల కృష్ణమాచారి, కొయ్యాల లక్ష్మణ్, బొడ్ల ఆనంద్, తోకల సత్యనారాయణ, రమేష్ యాదవ్, కలికోట శ్రీకాంత్, రాజ్ కుమార్, సుంకే అశోక్, ఏదులాపురం కుమార్, మాదాస్తు శ్రీనివాస్ క్రాంతి కుమార్, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## మద్యం సేవించి వాహనం నడిపితే కఠిన చర్యలు

### సిపి సుబ్బారాయుడు



జమ్మికుంట, మార్చి 17 (మనం న్యూస్)॰ మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని కరీంనగర్ సిపి సుబ్బారాయుడు అన్నారు. కరీంనగర్ సిపి సుబ్బారాయుడు ఆధ్వర్యంలో జమ్మికుంట పట్టణంలో గురువారం రాత్రి నాకాబంది వాహనాలు తనిఖీ నిర్వహించారు. వాహన తనిఖీలలో తాగి వాహనం నడుపుతున్న వారిపై బ్రీత్ అనలైజర్ టెస్ట్ ద్వారా డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు చేసి మద్యం సేవించి వాహనాలు నడిపిన 18 మంది పై కేసులు నమోదు చేశారు. నాలుగు కార్లు, ఒక ట్రాక్టర్, ఒక డీసీఎం వ్యాన్, 12 మోటారు సైకిళ్ళు సీజ్ చేయడం జరిగిందనీ తెలిపారు. అందులో ముఖ్యంగా పెండ్లి బృందాన్ని తీసుకు వెళుతున్న డిసిఎం వ్యాన్ డ్రైవర్ పై డ్రంక్ అండ్ డ్రైవ్ డేంజరస్ డ్రైవింగ్ కేసు నమోదు చేశారు. అలాగే ఒక యమహా బైక్ రైడర్ వాహనాన్ని సైలెన్సర్ మార్చి నడుపుతున్న ఒకరిపై కేసు నమోదు చేశారు. ఎట్టి పరిస్థితుల్లో మైనర్లకు వాహనాలు ఇవ్వరాదనీ అలాగే నెంబర్ ప్లేట్ లేకుండా తాగి వాహనాలు నడిపిన చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.మద్యం సేవించి వాహనాలు నడపడం ద్వారా రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉంటుందని తద్వారా వాహనదారులు ప్రమాదాలకు గురవడంతో వారి కుటుంబం చిన్నాభిన్నం అయ్యే అవకాశం ఉందన్నారు. ఈ వాహన తనిఖీల్లో అడిషనల్ డిసిపి శ్రీనివాస్, హుజరాబాద్ ఏసిపి వెంకట్ రెడ్డి , పట్టణ సీఐ రామచంద్ర రావు ,స్థానిక ఎస్సై యూనిస్ ఖాన్, ఇల్లంతకుంట ఎస్సై తోట తిరుపతి, ఏఎస్ఐ రవి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## కంటి వెలుగును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి



సుల్తానాబాద్,మార్చి 17 మనం న్యూస్ ః తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ పొన్నమనేని బాలాజీ రావు అన్నారు. శుక్రవారం సుల్తానాబాద్ మండలంలోని కందునూరిపల్లి గ్రామంలో గర్రెపల్లి వైద్య అధికారి డాక్టర్.మధుకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పన్నాల స్వరూప తిరుపతి,మండల ప్రత్యేక అధికారి నారాయణ,ఎంపీడీవో శశికళ,డాక్టర్ శిరీష,సూపర్ వైజర్ వెంకటరెడ్డి,ఏ నేమ్‌లు తారమ్మా,వీణ ,షబానా, రాజుబాయ్, ఆప్తమాలాజిస్ట్ అఖిలేశ్వరి, పంచాయతీ కార్యదర్శి రాజేష్, కుమార్, ఆశాలు,పద్మావతి, కళావతి,కమల, స్వరూప,శ్రీలత పాల్గొన్నారు.



# పేదోడికి కార్పొరేట్ వైద్యం అందించడమే సర్కారు లక్ష్యం

- నిరుపేద కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ వరం
- ఏదల ఆరోగ్యాన్ని విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం
- పెద్దపల్లి జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధుకర్



మంథని,మార్చి 17 మనం న్యూస్ ః ఆర్థిక స్థోమత లేని పేద కుటుంబాలకు కార్పొరేట్ వైద్య్య అందించాలన్నదే సర్కారు లక్ష్యమని బిఆర్ఎస్ పార్టీ మంథని నియోజకవర్గ ఇంచార్జీ,పెద్దపల్లి జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధుకర్ అన్నారు. శుక్రవారం మంథని పట్టణంలోని తన నివాసంలో పలువురికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం వరంలాంటిదన్నారు. అనారోగ్య కారణాలతో ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొంది ఆర్థికంగా నష్టపోతున్న నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించేలా సీఎం కేసీఆర్ సీఎంఆర్ ఎఫ్ పథకాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నారని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఆర్థికస్థోమత లేని నిరుపేదలకు ఆస్పత్రుల్లో వైద్యఖర్చు లకు ప్రభుత్వం ద్వారా సాయం అందించడం జరుగుతుందని ఆయన తెలిపారు.గత ప్రభుత్వాల హయాంలో ఈ పథకం ఉన్నా పేదోడి దరికి చేరలేదన్నారు. పేదల ఆరోగ్యాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని,మంథని లాంటి మారుమూల గ్రామాల్లోని ఏ ఒక్కరికి సీఎంఆర్ఎఫ్ ద్వారా లబ్ధి చేకూరలేదన్నారు. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు తర్వాత బిఆర్ఎస్ ప్రభుత్వం,సీఎం కేసీఆర్ పరిపాలనలో ఎంతోమందికి ఈ పథకం ద్వారా లబ్ది జరిగిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## గోశాలకు సహాయం చేయండి గోమాతను కాపాడండి



సుల్తానాబాద్,మార్చి 17 మనం న్యూస్ ః గురువారం రోజున పడిన అకాల వర్షాల వలన తడిసి ముద్దయిన గోశాలలోని ఆవులు, పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ పట్టణం యాదవ నగర్ గోశాల ఫౌండేషన్ అధ్యక్షుడు బండారి సూర్య నివాసంలో తాత్కాలికంగా నిర్మించిన,గోశాలలో ఆవులకు ఆవులకు సరిపడా రేకుల షెడ్డు స్థలము లేనందున అవి ఉండే ప్రాంతంలో వర్షపు నీరు నిల్వ ఉండి ఇబ్బందికర వాతావరణం ఏర్పడినది. గోశాల సభ్యులు మాట్లాడుతూ,సుల్తానాబాద్‌లో శ్రీ ధర్మశాస్త్ర గోశాలను రెండు సంవత్సరంలుగా నిర్వహిస్తున్నాము. ఈ గోశాల నిర్వహణను దాతల సమాయముతో నిర్వహిస్తున్నామని, గోశాలకు షెడ్డు లేనందను గోవులకు వానలకు ఎండలకు ఇబ్బంది పడుతున్నాయి. కావున దాతలు సహృదమంతో గోశాలకు రేకుల షెడ్డు నిర్మాణం కొరకు సహకరించగల రని ఆమ గోశాల తరపున మీకు విన్నవించుకుంటున్నారు. సంప్రదించవలసిన నెంబర్ గోశాల అధ్యక్షుడు బండారి సూర్య 9254266544,ఉపాధ్యక్షుడు మామిళ్ల రాకేష్ 9676047516,ప్రధాన కార్యదర్శి నూక రాందాస్ 9849862560 గల నెంబర్లకు ఫోన్ పే గాని గూగుల్ పే గాని పంపగలరని సభ్యులు కోరారు.

## జిల్లా ఆసుపత్రిని సందర్శించిన కాయకల్ప బృందం

### జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.శ్రీధర్



పెద్దపల్లి, మార్చి 17(మనం ప్రతినిధి): పెద్దపల్లి జిల్లా ఆసుపత్రిని కాయకల్ప బృందం సందర్శించిందని జిల్లా ఆసుపత్రి సూఫరింటెండెం ట్ డా.శ్రీధర్ శుక్రవారం తెలిపారు. కాయకల్ప బృందం ఆసుపత్రిలోని పరిశుభ్రత, హైజిన్ నిర్వహణ, బయో మెడికల్ వ్యర్థాల నిర్వహణ, ఇన్ఫెక్షన్ కంట్రోల్ నిర్వహణ, రికార్డు నిర్వహణ, ఆసుపత్రిలో పేషెంట్లకు అందుతున్న సేవలు నాణ్యత వంటి ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలిం చడం జరిందని తెలిపారు. అదే విధంగా జిల్లా ఆసుపత్రిలో రోగులకు అందిస్తున్న భోజనం నాణ్యత, భోజన నాణ్యతపై సర్వే నిర్వహణ చేశారని, మందుల ఖర్చు, మొదలగు 350అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారని, ఇట్టి పరిశీలన నిదేవికను కమీషనర్ ఆప్ హెల్త్ అండ్ ఫ్యామీలీ వెల్ఫేర్, హైదరాబాద్‌కు కాయకల్ప బృందం సమర్పించను న్నట్లు డాక్టర్ శ్రీధర్ తెలిపారు. ఈకార్యక్రమంలో కాయకల్ప బృందం సభ్యులు డా.రఘు, డా. ప్రశాంత్, డా. రెహమాన్, డా. స్టెల్లాలు, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## పేద ఇంటి ఆడపడుచు వివాహానికి హార్థిక సహాయం అందించిన ఎంపీటీసీ దంపతులు



ముత్తార ం,మార్చి 17 మనం న్యూస్ ః ముత్తారం మండలంలోని అడవిశ్రీరాంపూర్ గ్రామానికి చెందిన పొలం లావణ్య తండ్రి పొలం సమ్మయ్య తల్లి నరసమ్మ అనారోగ్యంతో గతంలో మరణించగా లావణ్య విష్ణువర్ధనుల వివాహానికి హాజరైన అడవి శ్రీరాంపూర్ ఎంపీటీసీ దొడ్డ గీతారాణి బాలాజీ 5116 రూపాయల ఆర్థిక సహాయం అందజేసి వారి కుటుంబానికి అండగా నిలిచారు. ఆర్థిక సహాయం అందించిన ఎంపీటీసీ దంపతులను గ్రామస్థులు అభినిందించారు.

## లక్కారంలో కడుపునొప్పి భరించలేక పురుగుల మందు తాగి మహిళా ఆత్మహత్య



ముత్తారం,మార్చి 17 మనం న్యూస్ ః ముత్తారం మండలంలోని లక్కారం గ్రామానికి చెందిన పంజాల శ్యామఅల అనే మహిళ ఆత్మహత్య చేసుకున్నది ముత్తారం ఎస్సై బేతి రాములు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 16వ తారీకు గురువారం రోజున లక్కారంలో సాయంత్రం అందాజ ఐదు గంటల సుమారులో రాముల వారి గుడి ప్రారంభోత్సవం ఉన్నందున గుడి వద్దకు వెళ్లి ఇంటికి వచ్చేసరికి మా తల్లి కడుపునొప్పి వచ్చిందని బాధపడుతుండగా మా ఊరిలో ఉన్న టిర్ఎంపీ డాక్టర్ దగ్గరికి వెళ్లి వచ్చేసరిగి ఏదో పురుగుల మందు తాగి ఆపస్మారక స్థితిలో ఉండగా పక్క వారి సహాయంతో పెద్దపల్లి లోని ప్రభుత్వం ఆసుపత్రికి తరలించగా అక్కడి డాక్టర్లు పరీక్షించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కి పంపగా చికిత్స పొందుతూ శుక్రవారం చనిపోయినట్లుగా డాక్టర్లు తెలిపారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ముత్తారం ఎస్సై బేతి రాములు తెలిపారు.

# ఇంటర్ ఇంగ్లీష్ పేపర్-1 పరీక్షకు (5592) మంది హాజరు

## జిల్లా అధికారి కల్పన

పెద్దపల్లి, మార్చి 17 (మనం ప్రతినిధి): జిల్లాలో ఇంటర్ పరీక్ష మూడవరోజు ప్రశాంతంగా జరిగిందని, శుక్రవారం ఇంటర్ మొదటి సంవత్సరం ఇంగ్లీష్ పేపర్-1 పరీక్షకు (5884) మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, (5592)మంది పరీక్షకు హాజరు కాగా (292)మంది విద్యార్థులు గైర్హాజరు అయ్యారని ఇంటర్మీడియట్ జిల్లా అధికారి కల్పన శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో శుక్రవారం జనరల్, వొకేషనల్ కలిపి (5884)మంది ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్ష రాయాల్సి ఉండగా, జనరల్ అభ్యర్థులు (4674)మందికిగాను (4476) మంది హాజరు కాగా, (198) మంది విద్యార్థులు గైర్హాజరు అయ్యారని, అలాగే వొకేషనల్ (1210) మందికి గాను (1116)మంది హాజరు కాగా (94)మంది విద్యార్థులు గైర్హాజరు అయ్యారని తెలిపారు. మొత్తం జిల్లాలో 95.04శాతం హాజరయ్యారని, మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని, ప్రశాంతంగా పరీక్ష జరిగిందని ఇంటర్మీడియట్ జిల్లా అధికారి కల్పన ఆప్రకటనలో పేర్కొన్నారు.

## అకాల వర్షానికి నేలమట్టమైన మొక్కజొన్న

### ఫసల్‌భీమా అమలులో రాష్ట్రప్రభుత్వ వైఫల్యం



వీణవంక-మార్చి17(మనం న్యూస్): మండలంలోని హిమ్మత్‌నగర్ గ్రామానికి చెందిన రైతు మోర్తాల రఘువరణ్ నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకొని మొక్కజొన్న పంట వేయగా గురువారం సాయంత్రం కురిసిన అకాల వర్షానికి పంట మొత్తం నేటమట్టమైందని , అలాగే గ్రామంలో రైతులు 100 ఎకరాలకు పైగా మొక్కజొన్న,వరి పంటలు వేయగా వడగళ్ల వర్షానికి దారుణంగా దెబ్బతిందని ఆర్థికంగా భారీగా నష్టపోయామని రైతు వాపోయారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫసల్‌భీమా యోజన పథకాన్ని రాష్ట్రములో అమలు చేయడంలో ప్రభుత్వము వైఫల్యం చెందిందన్నారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్ట పోయిన రైతులకు కేంద్రప్రభుత్వం అందించే ఫసల్‌భీమా అమలు చేయకుండా రాష్ట్రప్రభుత్వంవ రైతులకు అన్యాయం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రైతుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని ఈ పథకాన్ని రాష్ట్రంలో అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

## బిజెపి సంబరాలు

సిరిసిల్ల టౌన్, మార్చి 17 (మనం న్యూస్): హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్ నగర్ ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ బలపరిచిన అభ్యర్థి ఏబిఎన్ రెడ్డి విజయం సాధించడం పట్ల రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో శుక్రవారం సంబరాలు చేసుకున్నారు. ఈ బిజెపి పట్టణ అధ్యక్షులు నాగుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు గాంధీ చౌక్‌లో విజయోత్సవాలు జరుపుకుని, టపాసులు పేల్చి, మిఠాయిలు పంచిపెట్టారు.

### అక్రమంగా డబ్బులు అడిగిన వ్యక్తిపై కేసు నమోదు

ఇల్లందకుంట, మార్చి 17 (మనం న్యూస్): డబ్బుల కోసం ఒక వ్యక్తిని బెదిరింపులకు గురి చేసిన ఓ పత్రికా విలేకరిపై కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు మండలంలోని బూజునూరు గ్రామానికి చెందిన సరిగమ్ముల విజయ్ అనే వ్యక్తికి దళిత బంధు పథకం కింద ట్రాక్టర్ మంజూరైంది. ఈ ట్రాక్టర్‌ను నడిపించుకోవాలంటే తనకు పదివేల రూపాయల చొప్పున చెల్లించాలని రాచపల్లి గ్రామానికి చెందిన మూడెత్తుల శివకుమార్ అనే పాత్రికేయుడు విజయ్‌ని బెదిరింపులకు గురి చేశాడు. డబ్బులు చెల్లించని పక్షంలో రెవిన్యూ అధికారులకు చెప్పి, ట్రాక్టర్ తిరుగకుండా చేస్తానని బెదిరించాడు. దీంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

# గాయత్రి విద్యార్థుల 4వ రోజు ఎన్ఎస్ ఎస్ ప్రత్యేక శిబిరం

**ఆలోచనలతో ఆవిష్కరణ సాధ్యం**

**సమాజిక సేవలో మూడనమ్మకాల నిర్యూలన,**

**భారత నాస్తిక సమాజం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉప్పులేటి నరేష్**




పెద్దపల్లి, మార్చి 17(మనం ప్రతినిధి): ఆలోచనలతో ఆవిష్కరణలు సాధ్యమని సామాజిక సేవలతోనే మూడనమ్మకాలు నిర్మూలిం చవచ్చని భారత నాస్తిక సమాజం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉప్పు లేటి నరేష్ అన్నారు. మండలంలోని రాఘవాపూర్ గ్రామంలో గాయత్రి డిగ్రీ,పీజీ కళాశాల నిర్వహిస్తున్న జాతీయసేవా పథకంలో గ్రామంలో అక్షరాస్యత సామాజిక స్థితిగతులపై సర్వే నిర్వహించారు. అనంతరం ఎన్ఎస్ఎస్ క్యాంపులో కోఆర్డీనేటర్ సమ్మద్ అధ్యక్షతన మూఢనమ్మకాల నిర్యూలన అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన భారత నాస్తిక




సమాజం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉప్పులేటి నరేష్ మాట్లాడుతూ శాస్త్ర విజ్ఞానం ఎంతో అభివృద్ధి చెందుతున్న తరుణంలో ఇప్పటికి గ్రామీణ పట్టణ ప్రాంతాలలో మూఢనమ్మకాలు నమ్మడం దురదృష్టకరమని, విద్యార్థీ దశలోనే మూడనమ్మకాలు వీడుతూ సమాజాభివృద్ధికి కృషి చేయాలన్నారు. దొంగ స్వాములు భూత వైద్యులు ప్రజల అమాయకత్వాన్ని ఆసరా చేసుకొని ఆర్థికంగా సామజికంగా దోపిడీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దయ్యాలు భూతాలు మంత్రాలు ఒక బూటకమని, సైన్స్‌ను సైనికుడిలా విద్యార్థులు ముందుకు నడవాలని, విద్యార్థిదశలోని సేవ దృక్పథకం పెంపొందించుకొని ఉన్నత లక్ష్యాలు చేరుకోవాలని సూచించారు. సైన్స్ మ్యాజిక్ షో నిర్వహించిన నరేష్ ఇనుప కత్తిని కడుపులో గుచ్చుకోవడం, విద్యార్థి చేతిపై కిరోసిన్‌తో కాల్చడం, నోట్లో మంటలు లేపడం, గాలిలో విభూది సృష్టించడం, పేపర్లు కాల్చి చాక్లెట్లు చేయడం, విద్యార్థీ వాచిని మాయం చేసి రింగు తీసి ఇవ్వడం, లాంటి ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.

# భీభత్సం సృష్టించిన గులాబ్ తుఫాన్

వీణవంక-మార్చి17(మనం న్యూస్): గత రెండురోజుల క్రితం బంగాళాఖాతంలో ఏర్పడిన గులాబ్ తుఫాన్ ప్రభావం వల్ల మండలంలో గురువారం సాయంత్రం కురిసిన వడగళ్ల వాన వల్ల అన్ని గ్రామాలలో వేలాది ఎకరాలలో రైతులు వేసిన మొక్కజొన్న పంట పూర్తిగా నేలమట్టమైంది. దాదాపు 5 కోట్ల రూపాయలకు పైగా పంట నష్టం వాటిల్లింది. ఐలాబాద్ గ్రామంలో రైతు పురంశెట్టి ప్రకాష్ తనకు ఉన్న ఎకరం భూమిలో వేసిన మొక్కజొన్న ఈదురు గాలులు, వర్షానికి మొత్తం పడిపోవడంతో కంటతడి పెట్టాడు.చిరుపొట్ట దశలో ఉన్న వరి పొలాల్లో పూత రాలిందని మరి కొద్ది రోజుల్లో కోతకు రాబోయే పొలాలు దారుణంగా దెబ్బతిన్నాయని కిష్టంపేట గ్రామ రైతు బొంగోని రవి వాపోయారు. మామిడి తోటల్లో పూత, పిందెలు,కాయలు రాలిపోయాయని తోటల యజమానులు ఆవేదన వ్యక్తం చేశారు. వర్షం వల్ల పత్తి నలుపురంగుకు మారే అవకాశం ఉందని దీంతో కనీస మద్దతు ధర కు కూడా నోచుకొని పరిస్థితి ఉందని శ్రీరాములపేట రైతు బొబ్బల శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. వర్షం వల్ల తమ పరిస్థితి మరి అధ్వానంగా తయారైందని దేశాయిపల్లి గ్రామ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రప్రభుత్వం పంటనష్టాన్ని అంచనా వేసి త్వరలోనే పరిహారం చెల్లించాలని రైతులు విజ్ఞప్తి చేశారు.



# ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

## అదనపు కలెక్టర్ వి.లక్ష్మీనారాయణ

పెద్దపల్లి, మార్చి17(మనంప్రతినిధి)పెద్దపల్లి జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మేనేజింగ్ కమిటీ సభ్యుల ఎన్నిక కోసం ఎలక్షన్ నోటిఫికేషన్ విడుదల చేసిందని అదనపు కలెక్టర్ వి.లక్ష్మీనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్, రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షులు సంగీత సత్యానారాయణ జిల్లారెడ్‌క్రాస్ సొసైటి ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహణకు గాను ఎలక్షన్ అధికారిగా జిల్లా సహకార శాఖ అధికారి కె.మైకేల్ బోస్‌ను నియమించినట్లు తెలిపారు. జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీకి సంబంధించి మొత్తం 191 మంది ఓటర్‌లు ఉన్నారని, సొసైటీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు తెలిపారు. ఈనెల 23న ఉదయం 11గంటల నుండి సాయంత్రం 3గంటల వరకు నామినేషన్‌ల స్వీకరణ, ఈనెల 24న నామినేషన్ల పరిశీలన, ఈనెల 25న ఉదయం 11గంటల నుండి సాయంత్రం 3గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణ, ఈనెల 28న ఉదయం 9గంటల నుండి మధ్యాహ్నం 2గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నట్లు, అదే రోజు సాయంత్రం 3-30గంటలకు పోలైన ఓట్లు లెక్కించి పలితాలను వెల్లడించనున్నట్లు తెలిపారు. పలితాల అనంతరం సమీకృత జిల్లాకలెక్టరేట్ సమావేశ మందిరంలో మార్చి 29న నూతనంగా ఎన్నికైన మేనేజింగ్ కమిటి మెంబర్లకు ఓటింగ్ నిర్వహించి జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్, వైస్ చైర్మన్, కోశాధికారి, కార్యదర్శి, రాష్ట్ర ఎం.సి. మెంబర్‌లను ఎన్నుకోనున్నట్లు తెలిపారు. ఒక అభ్యర్థి రెండు నామినేషన్ల వరకు దాఖలు చేయవచ్చుని, నామినేషన్ పేపర్లను ఉదయం 11గంటల నుండి మధ్యాహ్నం 2గంటల లోగా కలెక్టరేట్‌లోని డి.సి.ఓ.కార్యాలయం నుండి పొందాలని, నామినేషన్ దాఖలు సమయంలో 2500/-నాన్ రీఫండబుల్ సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించాలని, సొసైటీ ఓటర్ జాబితా కావాల్సిన వారు ఈనెల 20నుండి 300రూపాయలు చెల్లించి పోందాలని, ఇతర వివరాలకు డి.సి.ఓ.ను సంప్రదించాలని అదనపు కలెక్టర్ వి.లక్ష్మీనారాయణ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# ప్రైవేటు కళాశాలల హోర్డింగ్‌లు తక్షణమే తొలగించాలి

## ముందస్తు ప్రవేశాలు మానివేయాలి

## ఎన్టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సంజయ్‌కుమార్

కరీంనగర్, మార్చి 17 (మనం న్యూస్): కరీంనగర్ జిల్లా కేంద్రంలో నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన ప్రైవేటు కళాశాలల హోర్డింగ్‌లను తక్షణమే తొలగించాలని నవ తెలంగాణ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు బుర్ర సంజయ్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఇంటర్మీడియట్ బోర్డు సెక్రటరీకి శుక్రవారం ఆయన వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంజయ్‌కుమార్ మాట్లాడుతూ నగరంలోని శ్రీ చైతన్య, నారాయణ కళాశాలతో పాటు పలు జూనియర్ కళాశాలల నిర్వాహకులు నిబంధనలకు విరుద్ధంగా ముందస్తు అడ్మిషన్లను చేసుకుంటూ విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో ఆందోళన రేకెత్తిస్తున్నారన్నారు. నగరంలోని ప్రధాన వీధుల్లో ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లను ఏర్పాటు చేసి అయోమయాన్ని రేపుతున్నారని పేర్కొన్నారు. గత మూడు నెలల నుంచి కరీంనగర్‌లో జూనియర్ కళాశాలల ప్రచారాలు, అనధికార అడ్మిషన్లకు పాల్పడుతున్నప్పటికీ సంబంధిత అధికారుల్లో చలనం రావడం లేదన్నారు. కళాశాలల నిర్వాహకులు అనుసరిస్తోన్న ధోరణి పట్ల నిరసన వ్యక్తం చేస్తూ విద్యార్థి సంఘాలతో కలిసి డిఐఇవోకు ఫిర్యాదు చేసినట్లు సంజయ్ తెలిపారు. అయినప్పటికీ కళాశాలల నిర్వాహకులపై ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. తద్వారా అక్రమ అడ్మిషన్లు, ప్రచారార్భాటాలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఇప్పటికైనా స్పందించి విద్యార్థులు, వారి తల్లిదండ్రులను అయోమయానికి గురి చేస్తోన్న కళాశాలల యాజమాన్యాల పట్ల చర్యలు చేపడుతూ నగర వ్యాప్తంగా ఏర్పాటు చేసిన హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలను తొలగించే చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఓయు జెఏసి నాయకులు బారి అశోక్‌కుమార్, అమ్మ వెంకటేష్, రాజశేఖర్, బద్దం ప్రవీణ్ రెడ్డి, ఉల్లెంగుల సాయిక్రిష్ణ, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.


మనం
జనం కోసం... అక్షర యజ్ఞం...
తెలుగు దినపత్రిక

కావలెను

'మనం' తెలుగు దినపత్రికకు ఈ దిగువ పేర్కొన్న సర్కిల్స్ పరిధిలో విలేకరులుగా పనిచేసేందుకు ఉత్సాహవంతులు కావలెను. చక్కటి రాత, తెలుగుభాషపై పట్టు ఉండి ఆసక్తి గల వారి నుంచి దరఖాస్తులు కోరబడుతున్నవి.

కావలసిన ప్రాంతాలు :

కరీంనగర్ జిల్లా : కరీంనగర్ క్రైమ్, గంగాధర, గన్నేరువరం, మానకొండూర్ రూరల్.

జగిత్యాల జిల్లా : జగిత్యాల టౌన్, జగిత్యాల రూరల్, ఎడ్యూకేషన్, దరూర్ క్యాంపు, మేడిపల్లి, ఇబ్రహీంపట్నం, కథలాపూర్, సారంగాపూర్, గొల్లపల్లి, మల్యాల, ఎండపల్లి,

రాజన్న సిరిసిల్ల జిల్లా : సిరిసిల్ల క్రైమ్, సిరిసిల్ల ఆర్.సి., రుద్రంగి, చందుర్తి, వేములవాడ టౌన్, వేములవాడ రూరల్, వేములవాడ ఆర్.సి., ముస్తాబాద్.

పెద్దపల్లి జిల్లా : పెద్దపల్లి / ఆర్.సి., టౌన్, రూరల్, రామగుండం, కోల్‌సిటి, జూలపల్లి, ఓదెల, పాలకుర్తి, అంతర్గాం, 8ఇన్ క్లైయిన్ కాలని, బసంత్‌నగర్.

మనం
జనం కోసం... అక్షర యజ్ఞం...
తెలుగు దినపత్రిక

ఉమ్మడి కరీంనగర్ జిల్లా కార్యాలయం
ఇ.నెం. 1-6-169, మమత థియేటర్ ప్రక్కన,
కలెక్టరేట్ రోడ్, భగత్‌నగర్, కరీంనగర్.

కె. తిరుపతి రెడ్డి
బ్యూరో ఇంచార్జ్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా
సెల్ : 83339 98076